# సృష్టి కిరణాలు

శ్రీరాజ్

ఇతరుల ఉత్తరాలు చదవకూడదన్న సంస్కారం తెలిసినప్పటికీ ఒక్కోసారి ఎవరికో వచ్చిన ఉత్తరాలు చూడాలని పిస్తుంది. అది కుతూహలం కావచ్చును. లేదా వాళ్ళమీద కసి కావచ్చును.


విజయ్ ఎవరో నాకు తెలీదు. కానీ, అతనికి వచ్చిన ఉత్తరం చదివాను. ఆ ఉత్తరమే చదవకపోతే, ఈ కథను రాసేవాణ్ని కాదు. కథలో రచయితగా నేనూ పాత్ర వహించేవాణ్ని కాదు.

నేను కాకినాడకి బదిలీ అయిన కొత్తరోజులవి.


ఓ రూం అద్దెకు తీసుకున్నాను. ఒంటరివాణ్ని. పగలంతా ఆఫీసులో గడిచిపోయేది. చీకటిపడ్డాక గాని రూంకి చేరేవాణ్ని కాదు. ఆ రూంకి వచ్చి పట్టుమని పదిరోజులు కాలేదు. ఈపది రోజుల్లో విజయ్ పేర మూడు ఉత్తరాలు వచ్చాయి. నేను రాకముందు ఆ రూంలో 'విజయ్' అనే కాలేజీ కుర్రాడు అద్దె కుండేవాడట. ఇంటిగలవాళ్ళు చెప్పగా తెలిసింది. మొదటి రెండుత్తరాలు ఇంటి గలవాళ్ళకి యిచ్చాను – వాటిని విజయ్‌కి అందజేయడమో, పోస్టుమాన్‌కి తిరిగి యివ్వడమో, ఏదో ఒకటి చేయమని.


రాత్రి పదిగంటలు దాటింది.

తాళం తీసి, గదిలో లైటు వేశాను. పోస్టుమాన్ లోపలికి విసిరిన కవరు నేల మీద పడిఉంది. ఆ కవరుమీద అడ్రస్ చూడగానే నాకు కోపం వచ్చింది.



మీ పిరికితనం బయటపడే దెప్పుడు?




విజయ్.... విజయ్.... విజయ్.... నా ప్రాణాలు తోడేస్తున్నాడు. కవరు టేబిల్‌మీదికి నిర్లక్ష్యంగా విసిరి, నా పనులు చూసుకోవడం మొదలు పెట్టాను.

చల్లగా గాలి వీస్తోంది. ఆ గాలి తాకిడికి ఎదురుగా కనిపిస్తున్న పార్కులో అశోకవృక్షాలు లయబద్ధమైన సంగీతం వినిపిస్తున్నాయి. వెన్నెల వెలుగుకి పెరట్లో చీకటివెలుగులు తమాషాగా పరుచుకున్నాయి. ప్రశాంతమైన వాతావరణం. అలాంటి వాతావరణంలో ఎంతసేపైనా ఉండిపోవాలనిపిస్తుంది, నాకు.

సిగరెట్టు కాలుస్తున్న నాకు—విజయ్‌కి వచ్చిన ఉత్తరం గుర్తువొచ్చింది. నాకు తెలియకుండా, ఆ ఉత్తరంతీసి చదవాలనే కుతూహలం కలిగింది. ఆవిజయ్ ఎవరో, అతని కథా కమామీషూ ఏఁవిటో తెలుసు కోవాలనే కసి ఏర్పడింది. అడ్డువచ్చిన సంస్కారాన్ని దూరంగా నెట్టి, విజయ్ ఉత్తరం చించి, చేతుల్లోకి తీసుకున్నాను.

'ప్రియమైన బావకి'

ఇది నా చివరి ఉత్తరం. నిన్ను జవాబు యిమ్మని అడగడంలేదు.

చచ్చేముందు - మనసులో పదిలంగా దాచుకున్న మధురమైన సంఘటనలు మరిచిపోలేక, అవి నాతోనే అంతరించడం యిష్టంలేక నీ ముందుంచి, శాశ్వతంగా ఈ జీవితంనుండి తప్పుకోవాలనే ఈ ప్రయత్నం.

ఆ రోజు యిప్పటికీ నా కళ్ళలో నిలిచిపోయింది.

నా స్నేహితురాలు లక్ష్మి పెళ్లిలో తొలిసారి మనం ఒకర్నొకరు చూసుకున్నాం. నాకు తెలీని నువ్వు ప్రతి క్షణమూ నా వెంట తిరుగుతూ, నీ మాటలతో నన్ను కవ్వించడానికి ప్రయత్నిస్తున్నావని గ్రహించాను. బల్లమీద నిలబడి, తోరణాల కోసమని మాఁవిడాకులు తుంచడానికి ప్రయత్నిస్తున్నప్పుడు కాలు జారి కిందపడ్డాను.

'దెబ్బ తగిలిందా?' ఆ పెరట్లో నిన్నొక్కడ్నే చూడగానే నాకు చిరుచెమట్లు పోశాయి. సిగ్గో, భయమో చెప్పలేను. నీ నుండి దూరంగా పారిపోదామని లేవబోయాను. ఊహూ.... నేను కదల్లేకపోయాను. బాధగా మూలిగాను.

నా పాదం చేతుల్లోకి తీసుకొని, నెమ్మదిగా రాస్తుంటే, నిన్నే చూస్తుండిపోయాను. అంతలోనే నాకు కోపం వచ్చింది, నువ్వు తీసుకున్న చనువుకి. వెంటనే లేచి, వెళ్ళిపోయాను.

పది రోజులు గడిచిపోయాయి. మా ఊరు వచ్చావు. చెరువు గట్టున కూర్చున్న నేను- నిన్ను చూసి ఆశ్చర్యపోయాను.

'ఏఁవండీ, నేను గుర్తున్నానా?' నా దగ్గరకు వచ్చి, సూటిగా అడిగేసరికి నాకు కోపం వచ్చింది. సమాధానం యివ్వకుండా, లేచి నిలబడి ఎటో చూస్తూ ఉండిపోయాను.

'క్షమించండి. నేను మీ కోసఁవే ఈ ఊరు వచ్చాను. లక్ష్మిగారు మీ అడ్రసు యిచ్చారు. మీతో చాలా విషయాలు మాట్లాడాలి. మీ ఇంటికి నడవండి, మాట్లాడుకుందాం.' ఎంత ధైర్యం! ఈసారి కోపం ప్రదర్శించలేదు.

'ఏఁవిటి మాట్లాడతారు? ఇక్కడే మాట్లాడండి.' నువ్వు మాట్లాడడానికి అనుమతి యిచ్చాను.

ఆ సమయంలో చెరువుగట్టున ఎవరూ లేరు. దగ్గర వున్న రావిచెట్టు కింద చతికిలబడి, నేలమీద గిరులు గీస్తున్నాను. మనసులో నెమ్మది నెమ్మదిగా చోటు చేసుకుంటున్నావు. నువ్వు మాట్లాడబోయేది ఊహిస్తూ, ఊహించలేక ఊపిరి బిగబట్టి ఉన్నాను.

'ఏఁవండీ.... నాకు ఉపోద్ఘాతాలూ, బంగళాఖాతాలూ చెప్పడం చాతకాదు. ఆ రోజు మిమ్మల్ని పెళ్ళిలో చూశాను. నా మనసుని దోచుకున్నారు. మీరు

అనుమతియిస్తే, నేను పెళ్ళిచేసుకుంటాను. కాదంటారా?.... ఈ పిచ్చివాడు అఘాతం లోకి జారిపోతాడు.' ఆ రెండు మాటలే అన్నావు.

నా ముందు ఓ దేవుడు నిలబడి చిరు నవ్వులు నవ్వుతున్నట్లు, ఆ దేవుడి చేతిని పట్టుకొని ఊహాలోకాల్లో విహ రిస్తున్నట్లు, ఏ అమ్మాయికీ లభించని అదృష్టం - తన ఒడిలోకి తీసుకొని లాలి స్తున్నట్లుగా తోచింది. ఆ అనుభూతి నన్ను ఉక్కిరిబిక్కిరి చేసింది.

ఒక క్షణం మాట్లాడలేకపోయాను.

నువ్వు ఆశగా ఎదురుచూస్తున్నావు.

'మా అమ్మతో మాట్లాడండి.' బిందె తీసుకొని, గబగబా అక్కడనుండి వెళ్ళిపోయాను.

నువ్వు మా యింటికి వచ్చావు. చిత్ర మైన కలయిక. అమ్మ నీకు అత్తయ్య కావడం, నువ్వు నాకు బావ కావడం - నా సంతోషానికి అవధుల్లేవు.

అలా మొదలయ్యింది, మన ప్రేమ.

అందరూ అమ్మను వెలి వేశారు. అమ్మ కేవలం నా కోసం బ్రతుకుతుంది. నా జీవితానికి నువ్వు వెలుగువి కాబోతున్నావని తెలిసి, అమ్మ పొంగి పోయింది. విడిపోయిన మన రెండు కుటుంబాలు మన పెళ్ళితో కలుసుకుంటా యని ఆశించింది.

ప్రతిరోజూ అందుకునే నీ ఉత్త రాలు చూసినప్పుడు, నువ్వు నిజంగా కాలేజీకి వెళ్తున్నావా అనిపించేది. ఆశలు కల్పించావు. అణువణువునా నిండి పోయావు. ఆదివారాలు, సెలవురోజుల్లో మా యింటికి వచ్చేవాడివి. రాత్రంతా పెరట్లో కూర్చొని, కబుర్లు చెప్పుకొనే వాళ్ళం. ఆ సమయంలో ఆకాశంలో వెన్నెల వెలుగులే కనిపించేవి. కోటిపల్లి రేవులో పడవ ప్రయాణం చేసినప్పుడు, వానలో తడిసి ఒకరికొకరు హత్తుకు పోయినప్పుడు, ఒంటరిగా వెన్నెల్లో డాబా మీద నీ ఒళ్ళో వాలిపోయినప్పుడు — నువ్వు దొంగలా నన్ను దోచుకునేవాడివి. అల్లరి చేసేవాడివి.

ప్రతిక్షణం నాదే అనిపించేది. ఆ క్షణం నువ్వే కావాలనిపించేది. నన్ను పిచ్చిదాన్ని చేశావు. నువ్వు లేకపోతే, నేను బతగ్గలనా? ఈ ఆలోచన వస్తే, నాకు నిద్ర రాదు. చచ్చిపోతానేమో ననే భయం. ప్రేమలో ఇంత మాధుర్యం ఉంటుందని నేను ఊహించలేదు. నా చేతల్లో, మాటల్లో, మనసులో నువ్వే.... నువ్వే.... నువ్వే బావా!

అందుకే, నన్ను నేను సమర్పించు కున్నాను. ఎందుకో నీ చేతుల్లో పువ్వులా నలిగిపోవాలనిపించింది. ఆ రోజు— ఆ వాతావరణం నా కన్నెతనాన్ని నీకు కానుకగా యిమ్మంది. బావవి. నాకు కాబోయే భర్తవి. నీ చేతుల్లో, గుండెల్లో యిమిడిపోయాను.

మనమధ్యజరిగిన ప్రతి చిన్నసంఘటన నాకు గుర్తుంది. ఇవన్నీ ఎందుకు రాస్తున్నానో తెలుసా? నేను మరచి పోలేదని చెప్పటానికే, బావా! కానీ, నువ్వు నన్నెలా మరిచిపోగలిగావు?

బావా! ఆ రోజు నీ చేతుల్లో ఒరిగి పోయినందుకు ఫలితంగా నీ ప్రతిరూపం చేతులు చాస్తూ, మన ముందుకి వస్తా నంటుంది. ఈ సంగతి అమ్మకు తెలియ నివ్వలేదు.

ఇంటికివెళ్ళి మీనాన్నతో మాట్లాడి, నన్ను పెళ్ళి చేసుకుంటానన్నావు. మాఁవయ్య కాదంటే — అతనితో తెగ తెంపులు చేసుకొని, నాకు తోడుగా ఉంటానన్నావు. నన్ను అన్యాయం చెయ్యనన్నావు.

కానీ, ఇది అన్యాయం, బావా! నువ్వెళ్ళి నెలరోజులు గడిచిపోయాయి. నీ రూంకి ఉత్తరాలు రాశాను. నీ మౌనం నన్ను భయపెడుతుంది. నేను ఏం తప్పు చేశానని నాకీ శిక్ష విధించావు. నాకు తెలుసు. మాఁవయ్య మన పెళ్ళికి ఒప్పుకో లేదు. మాఁవయ్య మాటను నువ్వు ఎదిరించలేవు. కన్నతండ్రి. అతని మనసు నొప్పించలేవు. అందుకే, నన్ను మరిచి పోయావు. నీ అవసరం తీర్చుకున్నావు. ఇప్పుడు నీకు అవసరంలేనిదాన్ని. ఈ పిచ్చిదాని చేయి మధ్యలో విడిచిపెట్టి, ఏమీ తెలియనట్లు ఊరుకున్నావు.

బావా! ఒక్క చిన్న కోరిక. నిన్ను త్యాగం చేయమనికోరను. నేను చనిపోయే ముందు — ఒకసారి నాకు కనిపించు. నాతోమాట్లాడవద్దు. నువ్వు కనిపిస్తేచాలు, లక్ష్మివారం నువ్వు తప్పకుండా మా ఇంటికి రావాలి. ఆలస్యం చేస్తే, కనిపించను.

కడుపులో నువ్వు కదులుతున్నావు. నీ ప్రతిరూపాన్ని అప్పగించకుండానే వెళ్ళిపోతున్నందుకు క్షమిస్తావుకదూ?

చివరి క్షణాల్లో నీ రాక కోసం నిరీక్షిస్తున్న - జ్యోతి.'

ఉత్తరం చదివి, నేను షాక్ తిన్నాను. ఒక ప్రేమ కథ - ప్రమాదంలో పడింది. గుడ్డిగా ప్రేమలో పడి, అసహాయతగా జీవితం అంతం చేసుకోబోతున్న ఆ అమ్మాయిమీద జాలి ఏర్పడింది. రేపే లక్ష్మివారం. విజయ్ కోసం ఆమె ఎదురు చూస్తుంది. అతడు కనిపించడు. ఆమె ఆత్మహత్య చేసుకుంటుంది. కడుపులో పెరుగుతున్న బిడ్డ హత్య చేయబడు తుంది. రెండు ప్రాణాలు నిష్కారణంగా ప్రేమ పేరుతో బలయిపోతున్నాయి.

విజయ్ మీద అసహ్యం కలిగింది. కల్లబొల్లి కబుర్లతో అమ్మాయిల్ని మోసగించడం, వాళ్ళ జీవితాలు నాశనం చేయడం- విజయ్‌లాంటి వాళ్ళకి సరదా. అవసరం తీరిపోగానే ఆడదాన్ని ఎంగి లాకు మాదిరి విసిరేస్తారు. వాళ్ళు సాధిం చేవరకు బుద్ధిమంతుల్లా ప్రవర్తిస్తారు. అందినంతవరకు ఆడదాని చుట్టూ తిరుగు తారు. అందిన తర్వాత - అసలు ఏమీ

జరగనట్లు దూరంగా జరిగిపోతారు. ఆ క్షణంలో విజయ్ కనిపిస్తే, అతని రెండు చెంపలు వాయించి బుద్ధి చెప్పా లనిపించింది.

ఎందుకో తెలీదుగాని — సృష్టి ఏర్పడినప్పటినుంచి మగవాడివల్ల తను మోసగింప బడుతుందని తెలిసినప్పటికీ, ఆడది తెలుసుకొని మోసపోతుంది. అలా మోసపోవడంలో వాళ్ళకి కలిగే ఆనందం ఏమిటో ఊహించలేను.

విజయ్ మాటలు నమ్మి 'ప్రేమా పిచ్చి' అంటూ జ్యోతి మోసపోయింది. ఇది తెలుసుకున్న నేను ఏం చేయాలి? రెండు ప్రాణాలు బలయిపోతున్నా యని తెలిసి, నే నెలా ఊరుకోగలను? పిచ్చిపిచ్చి ఆలోచనలతో నా తల వేడెక్కి-పోయింది.

దూరంగా చర్చిగంటలు వినిపించాయి. మూడుగంటలు దాటిపోయింది. మగ తగా నిద్రలోకి జారిపోయాను.

* * *

నే నొక నిర్ణయానికి వచ్చాను. నాకు చాతనయినట్లు జ్యోతికి సాయంచెయ్యాలి. ఆ అమ్మాయిని కాపాడాలి. విజయ్‌కి బుద్ధిచెప్పి, వాళ్ళిద్దర్ని ఒకటిగా చెయ్యాలి.

ఇంటిగలవాళ్ళని కలుసుకొని, విజయ్ గురించి ఆరా తీశాను. అతని గురించి వాళ్ళు ఎలాంటి వివరాలు చెప్ప లేకపోయారు. ఏదో కాలేజీలో చదువుకునే వాడనీ, పరీక్ష లయిపోగానే రూం ఖాళీచేసి వెళ్ళిపోయాడని మాత్రం చెప్పారు. విజయ్ పచ్చి మోసగాడు. ఇప్పుడా మోసగాణ్ని పట్టుకోవడం సాధ్యంకాదు.

అయితే, కర్తవ్యం ఏమిటి?

మొదట జ్యోతిని కలుసుకోవాలి. ఆమె ప్రాణాలు కాపాడాలి. ఆమె ద్వారా విజయ్ గురించి తెలుసుకోవాలి. 'భ్రమ' ఈ కథలో నేనూ పాత్ర వహించాలి.

ఆఫీసుకి సెలవుపెట్టి, జ్యోతి రాసిన ఉత్తరం మీది అడ్రసు చూసుకొని బయలుదేరాను.

* * *

నిండుగా ప్రవహిస్తున్న గోదావరి, పచ్చగా కనిపిస్తున్న పైరులు. జ్యోతి జీవితంలో గోదావరి నిండుదనం, కోన సీమ పచ్చదనం కలకాలం ఉండాలని పదేపదే కోరుతున్నాను.

కోటిపల్లి రేవు దాటేసరికి పదకొండు గంటలయింది. అక్కడనుండి మైలు దూరం నడవాలి ఆ ఊరు చేరటానికి. సన్నని కాలిబాట. పచ్చని పైరులు గాలికి విలాసంగా కదులుతున్నాయి. అక్కడక్కడ కనిపించే కొలనులు తామరపువ్వులతో నిండి ఉన్నాయి. ఎన్నో అస్తవ్యస్తమైన ఆలోచనలు నాలో నిండి ఉన్నాయి.



ఆ అమ్మాయిని చూసింతర్వాత నా మనసు ద్రవించిపోయింది. ఆమె నిజంగా జ్యోతే. ఆ జ్యోతి ఆరిపోవటం ఎవరూ యిష్టపడరు. ఆమెకు అన్యాయం చేసిన విజయ్ మనిషికాడు.

విజయ్‌కోసం యెదురుచూసినందువల్ల కాబోలు జ్యోతికళ్ళునీరసించిపోయాయి. ముంగురులు చెదిరిపోయాయి. క్షీణించి పోతున్న ఆశతో క్షణక్షణం బాధనుగుర్తు చేసుకున్నందువల్ల కాబోలు ఆమె నలిగి పోయినట్లు కనబడుతుంది.

విజయ్ స్నేహితుడిగా నన్ను నేను పరిచయం చేసుకొన్నాను. ఆమె చాలా ప్రశ్నలు వేయాలనుకుంది. కానీ ఎందుకో అడగలేదు.

జ్యోతి వాళ్ళ అమ్మగారు చుట్టాలింటికి వెళ్ళారట. సాయింత్రానికి కానీ ఆమె రారని చెప్పింది. వద్దంటున్నా జ్యోతి నాకు భోజనం సిద్ధంచేసింది.

భోంచేసిన తర్వాత ఇద్దరమూ తీరిగ్గా కూర్చున్నాం. నేను రచయితను. కల్పన చేయటం నాకు బాగా చాతవును. ఆమెలో ఆశలు మళ్ళీ చిగురింపజేయాలి.

"బావ యెందుకు రాలేదండీ? బావకి నామీద కోపం వచ్చిందా?" జ్యోతి కంటి ముత్యాలు నేలమీదకు జారిపోయాయి.

"విజయ్‌కు టైఫాయిడ్ జ్వరం. మంచంమీదనుండి కదల్లేని పరిస్థితి. మీ ఉత్తరాలకి జవాబు యివ్వలేక, తను మీ దగ్గరికి రాలేక నన్ను పంపించాడు. నిన్న మీ ఉత్తరంచూసి, అతను హడలిపోయాడు. ఏ అఘాయిత్యం చేస్తారో అని మీ ఊరు వెళ్ళమని నన్ను తొందర చేశాడు. అందుకే వచ్చాను. మీతో నాకు పరిచయం లేకపోయినా...." అందమైన అబద్ధం. ఆ అబద్ధం ఆమెజీవితాన్ని నిలబెడుతుంది. నా కా నమ్మకం ఉంది.

"నేను పొరపడ్డాను. నన్ను క్షమించమని బావకి చెప్పండి. నెలరోజులు దాటినా, బావదగ్గరనుండి ఎలాంటి జవాబు లేకపోయేసరికి నేనుభయపడ్డాను. బతకడంకన్న చావడమే నయమనిపించింది. అంతే .... ఇప్పుడుబావ ఎక్కడ ఉన్నాడండి?" ఆమెలో భయం తీరినట్లుంది.

"నిన్న వాళ్ల నాన్నగారు వచ్చి, ఇంటికి తీసుకువెళ్లారు. బహుశా, విజయ్‌కి నయమయేవరకు అక్కడ ఉండొచ్చు.... మీరు వాళ్లింటికి ఉత్తరాలు వ్రాయమని చెప్పాడు."

నా మాటలకి జ్యోతి పేలవంగా నవ్వింది.

ఎందుకు నవ్విందో నాకుఅర్థంకాలేదు. నేను తప్పుగా మాట్లాడానేమో?

"మీరు పొరబడి ఉంటారు. ఇంటికి ఉత్తరాలు రాస్తే, మావయ్య మమ్మల్ని బతకనివ్వరు. మా కుటుంబం మీద మావయ్యకి బోలెడంత కక్ష ఉంది. అతనికి మా మీద ఉన్న కక్షను పోగొట్టి ఈ పెళ్ళికి ఒప్పిస్తానన్నాడు, బావ. మావయ్యను ఒప్పించకముందే ఈ వ్యవహారం తెలిస్తే, అతను సహించరు."

ఆ తర్వాత – ఆ రెండుకుటుంబాల మధ్యసంబంధ బాంధవ్యాల్నీ, మన్పర్ధల్ని జ్యోతి వివరంగా చెప్పింది.

జ్యోతి తల్లి లలితమ్మగారు వర్ణాంతర వివాహం చేసుకున్నారు. పార్వతీశం గారు – 'ఆచారం కట్టుబాట్లు' అని పట్టుకు వేలాడే చాంధసుడు. అంతకు మించిన పట్టుదల ఉన్నమనిషి.వంశాన్నీ, కుటుంబాన్నీ కాదని, ఎవడినో పెళ్ళి చేసుకుందని – తన తోబుట్టువని, ఆ ఇంటి ఆడపడుచని ఆలోచించకుండా ఇంటినుండి గెంటేశారు. కన్న తండ్రి పోయినప్పుడు లలితమ్మని పుట్టింటి గడప తొక్కనివ్వలేదు. అంతే కాదు – లలితమ్మ వైధవ్యం పొందిన రోజున కూడా అతను పరామర్శించటానికి వెళ్లలేదు. ఆమె అనుభవిస్తున్న కష్టాల్ని చూసి, జాలిపడలేదు సరికదా– మరింత ద్వేషం పెరిగిపోయింది. ఆమెను నిర్దాక్షిణ్యంగా ఆ వూరునుండి పంపేశారు. ఆ రెండు కుటుంబాల మధ్య వైరం ఏర్పడి, బంధుత్వాల వంతెన కూలి పోయింది.

"విడిపోయినపెద్దవాళ్లను చిన్నవాళ్లు కలపగలరని, మావయ్య బావమాట కాదనరని అమ్మకి నమ్మకంఉంది."

"నిజంవేనండీ....పట్టుదలనేది ఎవరికీ జీవితాంతం ఉండదు. తప్పకుండా మీ పెళ్లికి మీ మావయ్యగారు ఒప్పుకుంటారు. మీరు ధైర్యంగా ఉండండి."

విజయ్ మంచివాడని ఎన్నో సంగతులు చెప్పింది, జ్యోతి.

సాయంత్రం నేను బయలుదేర్లేసరికి లలితమ్మగారు ఇంటికి వచ్చారు. జ్యోతి వాళ్లమ్మగారికి నన్ను పరిచయంచేసింది. విజయ్ ఆరోగ్యం ఎలాఉందో ఎప్పటికప్పుడు ఉత్తరాలు వ్రాయమని లలితమ్మగారు చెప్పారు. నేను 'అలాగేనని' చెప్పి, బయలుదేరాను.

ఎందుకో విజయ్ మీద నాకు సదభిప్రాయంలేదు. అతను పార్వతీశంగారి కొడుకు. ఆ రక్తం పంచుకు పుట్టిన విజయ్‌లో తండ్రిబుద్ధులు మాత్రం ఎందుకుండవు? నెలరోజుల నుండి మౌనం వహిస్తూ, జ్యోతి విషయం పట్టించుకోవడం లేదంటే – అతను మోసంచేశాడనే తెలుస్తుంది. ఈ రోజు అబద్ధం చెప్పి, జ్యోతిప్రాణాలు కాపాడగలిగాను. కానీ, రేపు? సాహసించి, విజయ్‌ని కలుసుకోవాలి. అతణ్ని దారికి తీసుకువచ్చి, జ్యోతిని కలపాలి. కథ పూర్తికాకుండానే మధ్యలో విడిచి, జ్యోతికి అన్యాయం చేయాలనిపించలేదు. ఈ కథ ఎలాంటి మలుపులు తిరుగుతుందో, ఎలా ముగుస్తుందో?

* * *

వారంరోజులు గడిచిపోయాయి.

సెలవులు కలిసిరాడంచేత విజయ్‌ని కలుసుకోవాలని వాళ్ల వూరు బయలు దేరాను. ఆ రోజు జ్యోతి చెప్పిన విషయాల్ని బట్టి పార్వతీశంగారి చిరునామా తెలుసుకోగలిగాను.

ఆ ఊళ్లో పార్వతీశంగారి ఇల్లే పెద్దదిగా కనిపించింది. విశాలమైన లోగిలి. నౌకర్లూ చాకర్లూ దండిగా ఉన్నప్పటికీ, ఆ ఇంట్లో సందడిగా లేదు. నిశ్శబ్దంగా, వెలితిగా ఉన్న ఆ వాతావరణంలో ఎవరిపనులు వారు చేసుకుపోతున్నారు.

తూర్పు వేపు మామిడి చెట్టుకింద పడక కుర్చీలో కూర్చుని, దీర్ఘంగా ఆలోచిస్తున్న పార్వతీశంగారి దగ్గరకి నన్ను ఒక నౌకరు తీసుకుపోయి-" "అయ్యగారూ! అయ్యగారూ! వీరు మన విజయ్‌బాబు సేయితులంట" అని పరిచయం చేశాడు.

పార్వతీశంగారు ఆజానుబాహువు. దబ్బపండు ఛాయ, విశాలమైన ఫాలభాగం, తీక్షణమైన చూపులు, నుదుటిమీద విభూతిరేకలు, మెల్లో రుద్రాక్ష మాలలు - ఇదీ అతని వేషం. అతన్ని చూస్తే, ఎవరికైనా గుండె దడదడలాడుతుంది.

నేను విజయ్ స్నేహితుణ్ణని, ఇద్దరమూ కాలేజీలో చదువుకొనే వాళ్లమని, విజయ్‌ని చూసిపోదామని అక్కడకు వచ్చానని అతనితో చెప్పాను.

అతను కూర్చోమని సైగచేశారు. మజ్జిగ తెప్పించి, నన్ను తీసుకోమన్నారు. పన్నెండు కాలేదు. ఎండ మండిపోతుంది. నా దాహం ఎలా కనిపెట్టారో గాని, మజ్జిగ తీసుకున్న తర్వాత కొంచెం స్థిమితపడ్డాను.

"మా విజయ్‌గురించి నీ అభిప్రాయం ఏమిటబ్బాయ్?" పార్వతీశంగారి ప్రశ్నకి తుళ్లిపడ్డాను. ముసలాయన నా అభిప్రాయం సేకరించడంలో ఉద్దేశం ఏమిటో?

"మీ విజయ్ కేమండీ?.... చాలా మంచివాడు. తెలివైనవాడు. మీకు తగిన కొడుకు." నా మాటల్లో ద్వంద్వం లేకపోలేదు.

"అబద్ధం.... నిజంగా వాడు మంచివాడైతే, నాకుచెడ్డపేరు తీసుకురాకూడదు. నిజంగా తెలివైన వాడైతే చదువు ఎగ్గొట్టి ప్రేమలో పడకూడదు. నిజంగా వాడు నాకు తగిన కొడుకైతే, ఓ భ్రష్టురాలి కూతుర్ని పెళ్ళిచేసుకోవడానికి సిద్ధపడకూడదు." అతను ఆవేశంగా అరిచారు.

నేను విజయ్‌ని తప్పుగా అంచనా వేశాను. జ్యోతికి అన్యాయం జరగదు. నా మనసులో అలజడి కొంచెం తగ్గింది.

"చూడబ్బాయ్.... మనం పుట్టక ముందు వంశమూ, ఆచారమూ, కట్టుబాట్లూ, సాంప్రదాయాలూ.... ఇలా ఎన్నో పుట్టాయి. ఒక వంశంలో పుట్టినప్పుడు ఆ వంశం ఆచారాలూ, కట్టుబాట్లూ, సాంప్రదాయాలూ పాటించవలసిన బాధ్యత మనకుంది. వాటిని కాదనే హక్కు ఎవరికీ లేదు.

"ఆ హక్కును నా తోడబుట్టింది తీసుకుంది. ఈ ఇంటి గౌరవాన్ని సర్వనాశనం చేసింది. అలాంటిదాన్ని నేను క్షమించలేకపోయాను. నా కంటికి కనిపించనంత దూరం పంపించేశాను. ఏళ్ళు గడిచిపోయాయి. ఈ ఇంటి ఆడపడుచు చచ్చిపోయిందని మరిచిపోయాము. కానీ, ఇప్పుడు.... ఇంత కాలానికి విజయ్ ఏంచేశాడో తెలుసా? ఆ భ్రష్టురాలు బ్రతికుందనీ, దానికి ఎదిగున్న కూతురుందనీ, ఆ అమ్మాయి మెళ్ళో తాళికడతానని నాతో వాదించాడు. అదెలా వీలవుతుంది?"

"కాలం మారిపోతుంది. కాలంతో బాటు మనమూ మారిపోవాలి. మనం ఏర్పరచుకున్న ఈ కట్టుబాట్లనీ, సాంప్రదాయాల్ని కాలానుగుణంగా మార్చుకోవాలి. ఇలాంటి మార్పును మీలాంటి పెద్దవారే హర్షించాలి. ప్రోత్సహించాలి. అప్పుడు ఆమె భ్రష్టురాలు కాదు. ఆ అమ్మాయిని విజయ్ పెళ్ళిచేసుకోవడం తప్పుకాదు..... తప్పుగా మాట్లాడినా, ఎక్కువగా మాట్లాడినా నన్ను క్షమించండి."

పార్వతీశంగారు నా వేపు కోపంగా చూశారు.

"అసాధ్యం .... నా బొందిలో ప్రాణం ఉండగా అలా జరగటానికి వీల్లేదు. పగలు వెన్నెల కాస్తోందా? రాత్రి ఎండ పొడుస్తుందా? లేదు...లేదు... అంతే! ఈ కుటుంబం వంశం, సాంప్రదాయం, కట్టుబాట్లలో మార్పు రావడానికి వీల్లేదు. అలాంటి మార్పు కావాలనుకొనే వాడయితే, విజయ్ ఈ వంశంలో పుట్టకుండా ఉండాల్సింది. ఈ కుటుంబంలో పుట్టిన తర్వాత, అందులో నా కొడుకుగా పుట్టిన తర్వాత - నన్ను ఎదిరించి, ఏ పనీ చేయటానికి వీల్లేదు."

పార్వతీశంగారి మాటల్లో - 'వంశమూ, సాంప్రదాయం' లాంటి పదాలు పదేపదే వినిపిస్తున్నాయి. అతనికీ, విజయ్‌కీ ఘర్షణ జరిగే ఉంటుంది. పార్వతీశంగారితో మాట్లాడి ప్రయోజనంలేదు. అతన్ని ఒప్పించే కంటే ఎదిరించడం నయం. విజయ్‌కి యిదే సలహా యివ్వాలి. జ్యోతికి అన్యాయం చేయకూడదనే ఆలోచన విజయ్‌కి ఉండాలిగాని పార్వతీశంగారు ఏం చేయలేరు.

జ్యోతి ఎవరో నాకు తెలియనట్లే ప్రవర్తించాను.

పార్వతీశంగారు - కొన్ని తరాల నాటి ఆ కుటుంబ చరిత్రపుటల్ని వెనక్కి తిప్పారు. నాకు ఊపిరాడనంతగా ఆ వంశం గొప్పలు చెప్పుకుపోయారు. అతనికి నేను శ్రోతగా మిగిలిపోయాను.

అపరాహ్ణంవేళ దాటింది.

పార్వతీశంగారి బలవంతంమీద, భోంచేయక తప్పలేదు. భోజనం ముగిసిన తర్వాత–విజయ్ కనిపించడం లేదేమని అడిగాను. విజయ్‌ని కలుసుకొని, జ్యోతి పరిస్థితి ఏఁవిటో తెలియజేస్తే, నేను వచ్చినపని పూర్తయినట్లే. నేను వచ్చి మూడు గంటలు దాటింది. నేనూ, పార్వతీశంగారూ మాట్లాడుకున్న మూడుగంటల్లో ఎవరూ మా దగ్గరికి రాలేదు. అందుకే, ధైర్యంగా విజయ్ కనిపించంలేదేమని అడిగాను.

కొన్ని క్షణాలు వృధాగా గడిచిపోయాయి.

"ఆ భ్రష్టుడు మరి కనిపించడు.... ఈ కుటుంబాన్ని కాదని, కన్నతండ్రిని ఎదిరించి వాడేం సాధించగలడు?"

"ఇల్లు విడిచి వెళ్ళిపోయాడా?"

"కాదు. ఈ లోకాన్నే విడిచిపోయాడు."

అతను చలించకుండా, చాలా సామాన్యంగా చెప్పారు. నా తల గిర్రున తిరిగింది.

"అవును... వాడు బతికి నన్ను బాధ పెట్టకుండా చచ్చి నాకు మనశ్శాంతి కలుగజేశాడు. అబ్బాయ్! వాడు పోయినందుకు నేను బాధపడుతున్నానను కుంటున్నావా? లేదు.... లేదు.... ఈ కుటుంబ గౌరవం పోలేదని సంతోషిస్తున్నాను. నాకున్న నలుగురిలో ఒకడు పోయాడు. అంతే!...."

అతని మాటలకి ఆశ్చర్యం, అసహ్యం కలిగాయి.

నాకు తెలుసు. కన్నతండ్రితో ఓడిపోయి, ప్రేమను సాధించలేక ఏ అఘాయిత్యమో విజయ్ చేసుకొని ఉండాలి. కానీ, విజయ్ లేడని తెలిస్తే, జ్యోతి ఏమవుతుంది? అప్పుడు జ్యోతికి అబద్ధం చెప్పి, ఆ ప్రేమకథను ఒక మలుపుకి తీశాను. ఇప్పుడీ విషాద గాథను ఏ మలుపుకి తీసి, జ్యోతిని కాపాడాలి?

నాలో వెర్రిఆవేశంకట్టలుతెంచుకుంది.

"మీ కుటుంబానికి విజయ్‌ని బలి చేశారు. అన్యాయం...." అని గట్టిగా అరిచాను, నేను తట్టుకోలేక.

"కాదు.... వాడు ప్రేమకి బలయిపోయాడు." చాలా నిశ్చలంగా చెప్పి, అతను అక్కడనుండి చరచరా వెళ్ళిపోయాడు.

నాతో వస్తున్న పార్వతీశం నౌకర్ని దారిలో అడిగాను – 'విజయ్ ఎలా చనిపోయాడ'ని.

వాడు కళ్ళ నీళ్ళు పెట్టుకొని, చెప్పడం మొదలుపెట్టాడు.

"తఁవరితో అబద్ధం చెప్పకూడదండీ.. విజయ్‌బాబు తనేదో చేసుకొని చచ్చిపోలేదండీ. పెద్దయ్యగారిసేత చంపబడ్డారు... ఆ తండ్రీ కొడుకుల మద్దె ప్రెతిరోజు గొడవలు జరిగేయి. మొదట్లో మాకూ తెలిసేదికాదు. ఆ గొడవలెందుకో అనుకునీవాళ్ళం. రాను రాను తెలిసింది– విజయ్‌బాబు జ్యోతమ్మని పెళ్ళిచేసుకోవడం పెద్దయ్యగారికిట్టంలేదని. పెద్దయ్యగారి పట్టుదల మాకెవురికీ తెలీవండీ. అనుకుంటే, ఎలాటి పనైనా చేస్తారు. విజయ్‌బాబు ఇంటితో తెగతెంపులు చేసేసుకుంటానని చెప్పారు. పెద్దయ్యగారు విజయ్‌బాబుని ఊళ్ళోనుండి కదల్నివ్వలేదు. పట్నంలో ఉన్న ఆ బాబు గది కాళీ చేయించేశారు. కొట్టారు. తిట్టారు. శానా కట్టాలు పెట్టేశారు. వారం క్రితం– విజయ్‌బాబు రాత్రప్పుడు ఇల్లొదికి పారిపోతుంటే, పెద్దయ్యగారు చూసేశారు. అంతే... అయ్యగారి సేతికర్రతో గొడ్డును బాదినట్లు విజయ్‌బాబుని బాదారు. అందరమూ చూస్తుండగానే విజయ్‌బాబుని సంపేశారు."

'హే, భగవాన్! ఈ దారుణానికి కారణమైన పార్వతీశంగార్ని ఎవరు శిక్షిస్తారు?'

* * *

'విజయ్ టైఫాయిడ్ వలన చనిపోయాడు. అర్ధాంతరంగా, అన్యాయం చేసి వెళ్ళి పోతున్నందుకు జ్యోతిని క్షమించమని కోరుతూ–విజయ్ పెద్ద బాధ్యతను ఆమెమీద ఉంచాడు. జ్యోతి తనకోసం కాకపోయినా, కడుపులో ఉన్న విజయ్ ప్రతిరూపం కోసమైనా బ్రతకాలి.' సరికొత్త కల్పన. నాకల్పనతో ఆమె కన్నీళ్ళను తుడిచేయలేను. కానీ కొత్త ఆశలు కల్పించి, ఆమెను చావునుండి తప్పించగలనేమో?

ఏమో? నా ప్రయత్నం నేను చేయాలనే ఉద్దేశంతో మర్నాడు– జ్యోతి వాళ్ళ ఊరు వెళ్ళాను.

ఇంట్లో జ్యోతి కనిపించలేదు.

లలితమ్మగారు నన్ను చూసి, బావురుమన్నారు.

"వచ్చేవా, బాబూ... రా... జ్యోతి ఉందనుకుంటున్నావా? లేదు... అదిగో– నువ్వెళ్ళిన మర్నాడే మా అన్నయ్య ఊరి మనుషులెవరో వచ్చి, జ్యోతికి ఏమో చెప్పారంట. ఆ రాత్రే జ్యోతి ఏట్లో దూకి చచ్చిపోయింది. మనకి కనిపించని చోటుకి వెళ్ళిపోయింది. ఏం జరిగిందో నాకు తెలీదు... నువ్వైనా చెప్పు, బాబూ..."

ఎవరికీ ఏమీ తెలీదు. జ్యోతి కడుపులో తను ఉన్నట్లు విజయ్‌కి తెలీదు. విజయ్ ప్రేమ పేరుతో బలయిపోయాడని జ్యోతికి తెలీదు. రక్తం పంచుకు పుట్టిన వాణ్ని కన్నతండ్రే కర్కశంగా ఛంపేడని లలితమ్మగారికి తెలీదు. నేను ఎవరికీ ఏమీ కాకపోయినా–ఈ కథలో పాత్ర వహించినట్లు పార్వతీశంగారికి తెలీదు. అన్నీ నాకు తెలిసినప్పటికీ, నేను ఎవర్ని కాపాడగలిగాను? ఎవర్ని మార్చగలిగాను? ఎవర్ని ఓదార్చగలిగాను?

నేను కల్పన చేయవలసిన అవసరం తీరిపోయింది.

———